విత్తన ఎంపిక కీలకం..

- పంట దిగుబడిలో ముఖ్యం
- నకిలీతో జాగ్రత్త అవసరం

టేకుమట్ల: మార్కెట్‌లో నకిలీ విత్తన మాఫియా రాజ్యమేలుతూ రైతులను ఆర్థికంగా తీవ్ర నష్టాలకు గురి చేస్తోంది. ప్రస్తుతం నాణ్యమైన పంటల దిగుబడికి విత్తన ఎంపిక కీలకంగా మారింది. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయాధికారులు నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటూ నిరంతరం రైతులకు అవగాహన కల్పిస్తే సాధ్యమైనంత వరకు నియంత్రించవచ్చు.

నకిలీ విత్తనాల వల్ల ముప్పు..

నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి, నాణ్యత, జన్యు సమగ్రతను కలిగి ఉండవు. ఎదుగుదల లేని అంకురోత్పత్తి, నాణ్యత లేని మొక్కల ఎదుగుదల వంటి లక్షణాలు కనిపిస్తాయి. దాని వల్ల రైతులకు కనీసం పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి నెలకొని ఆర్థికంగా నష్టపోతాడు. అంతే కాకుండా ఆహార అధిక ధరలు, ఆహార కొరతలకు దారి తీస్తుంది.

నకిలీ విత్తనాల నియంత్రణలో వ్యవసాయాధికారుల పాత్ర..

- నకిలీ విత్తనాల ఉత్పత్తి, వాటి నియంత్రణకు కఠినమైన నిబంధనలు అమలు చేయాలి.
- నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రమాణాలకు అనుగూనంగా అమలు చేసేందుకు రెగ్యులేటరీ సంస్థలు, విత్తన కంపెనీలు, పంపిణీ దారులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.
- నకిలీ వత్తనాల వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- లూజు సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దు.
- అనుమతి పొందిన విత్తన డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలి.
- కొనుగోలు సమయంలో ప్యాకెట్‌పై ఉన్న తయారీ తేదీ, కాలం ముగిసే తేదీనీ తప్పనిసరిగా చూసుకోవాలి.
- కొనుగోలు చేసిన రశీదు తీసుకోవాలి.
- ఇతర రాష్ట్రాల నుంచి అనుమతి లేకుండా దిగుమతి చేయబడిన విత్తనాలను కొనుగోలు చేయొద్దు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తనాలు

ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు



వానాకాలం సీజన్ ప్రారంభం అయింది. కావున రైతులు విత్తనాలను కొనుక్కునే సమయంలో ఎవరైనా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, షాప్ సీజ్ చేస్తాం. ఆధికృత డీలర్లు మాత్రమే విత్తనాలను విక్రయించాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

-విజయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

అవగాహన కల్పిస్తున్నాం..



వానాకాలంలో రైతులు విత్తనాలను ఎక్కువగా కొనుగోలు చేస్తారు కావున దాన్ని అదనుగా చేసుకుని ఎవరైనా నకిలీ విత్తనాలు మార్కెట్‌లో సరఫరా చేసే అవకాశం ఉంటుంది. కావున గుర్తింపు పొందిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. అనుమతి లేని దుఖాణాల్లో విత్తనాలను, తక్కువ ధరకు వచ్చే అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేయొద్దు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, టేకుమట్ల

బ్లాక్‌లో పత్తి విత్తనాలు!

- డిమాండ్ ఉన్న రకాలకు కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- అధిక ధరకు విక్రయం

రేగొండ(కొత్తపల్లిగోరి): రోహిణి కార్తెలో వర్షం కురిస్తే చాలు పత్తి విత్తనాలు విత్తుతారు. ఎక్కువ శాతం రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేశారు. అందుకోసం రైతులు పత్తి విత్తనాలు కొని సిద్ధంగా పెట్టుకుంటున్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాలలో కొన్ని రకాల విత్తనాలు దొరకడం లేదంటు వ్యాపారులు ఎక్కువ రేటుకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తుండగా, మరికొన్ని రకాల విత్తనాలు అండర్ సేల్ చేస్తున్నారు.

బ్లాక్‌లో విక్రయిస్తున్న వ్యాపారులు

మార్కెట్లో సుమారు 100 రకాల కంపెనీల విత్తనాలు ఉన్నాయి. గత ఏడాది పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.853 ఉండగా ప్రస్తుతం రూ.864 అయ్యింది. కొన్ని కంపెనీల విత్తనాలను అండర్ సేల్ అంటే ప్యాకెట్ రూ.700 నుంచి రూ. 800కి విక్రయిస్తుండగా, మరికొన్ని కంపెనీల విత్తనాలు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. అన్ని బీటీ-2 విత్తనాలే అయినా రైతుల నమ్మకాన్ని బట్టి వారు ఫలానా సీడ్ కావాలంటే వ్యాపారులు అవి దొరకడం లేదు, డీలర్లే వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారని చెబుతూ వాటిని దుకాణాల్లో పెట్టకుండా రైతు నుంచి ముందుగా డబ్బులు తీసుకుని ప్యాకెట్లు వేరే చోట ఇస్తున్నట్లు తెలుస్తుంది. దుకాణాల యాజమానులు తమ ఇళ్ల వద్దనో, తమకు తెలిసిన వారి ఇళ్లలోనో ఉంచి ఒక్కో ప్యాకేట్ 1500, 2500 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

చర్యలేవి..

నకిలీ విత్తనాలు విక్రయించకుండా, అదేవిధంగా నాణ్యమైన విత్తనాలు అధిక రేటుకు బ్లాక్ మార్కెట్లో విక్రయించకుండా అదుపు చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు మొక్కుబడిగా దుకాణాలు తనిఖీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా అధిక రేటుకు విక్రయించినా, నకిలీ విత్తనాలు విక్రయించినా తమ దృష్టికి తీసుకురావాలని దుకాణాదారులకే చెబుతున్నారు తప్ప గ్రామాల్లో విక్రయిస్తున్న వారిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న అధికారులు

చిట్యాల: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రావణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ చేశారు. షాపులలో ఉన్న రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకూడదని అన్నారు. రైతులు విత్తనాలు తీసుకపోయినప్పుడు రశీదులను తప్పకుండా ఇవ్వాలని అన్నారు. ఒకవేళ రశీదులు ఇవ్వకపోతే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే రైతులు విత్తనాలను కొనే ముందు ధర ఎంత ఉందో తెలుసుకోవాలని, అధిక ధరకు అమ్మితే పోలీస్ లేదా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణకుమార్, పోలీస్ సిబ్బంది, ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాటారం(మహదేవపూర్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ప్రభావతి హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తన, పురుగు మందు విక్రయ కేంద్రాల్లో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విత్తన ప్యాకెట్లు, లైసెన్స్‌లను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి కొనుగోలుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. నకిలీ, లూజ్ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేయాలని చూస్తే లెసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు పీడీ యాక్ట్‌లు ప్రయోగించడం జరుగుతుందన్నారు. విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే ఊరుకునేది లేదన్నారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

బియ్యం అందజేత



ములుగు: జిల్లా కేంద్రంలోని సఫాయి వాడకు చెందిన నిరుపేద అయిన కొమరమ్మ కుటుంబానికి గండ్రకోట సుధీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బియ్యం అందజేశారు. గండ్రకోట సుధీర్ ఆదేశాల మేరకు సభ్యులు 25 కేజిల బియ్యం తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మెర్గు సంతోష్, ఎనుగందుల శ్రావణ్, వెంకటేష్, రాజు నాయక్, నరేష్ ఉన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఇసుక లారీ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌పైకి బుధవారం రాత్రి లారీ దూసుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌పైకి ఎక్కింది. దీంతో రోడ్డు పక్కన వెళ్తున్న వాహనాదారులు, ప్రయాణికులు ఒక్క సారిగా భయందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం లారీకి మరమ్మతులు చేపట్టి తీసుకెళ్లారు. డీవైడర్ పది మీటర్ల మేరకు ధ్వంసమైంది. అతివేగంగా ఇసుక లారీలను అజాగ్రత్తగా నడపడంతోనే డివైడర్‌పై మండల కేంద్రంలో దూసుకెళ్లిన ఘటనలు చాలా ఉన్నాయి. పోలీసులు స్పందించి లారీల వేగాన్ని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కంకణాల రమేష్ గురువారం ఉదయం ఏటూరునాగారం 163 జాతీయ రహదారి 2వ జంపన్నవాగు బ్రిడ్జిపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి వరంగల్‌కు తరలించారు. వాకింగ్ చేస్తున్న వారిని సైతం వాహనాలు ఢీకొట్టడంతో వాకింగ్ చేసే వారు భయభ్రాంతులకు గురవుతున్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి



వెంకటేశం (ఫైల్)

కాటారం: తాటి చెట్టు పైనుంచి తీవ్రగాయాలపాలైన గీత కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని ధన్వాడలో చోటు చేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధన్వాడకు చెందిన బుర్రి వెంకటేశం (64) వారం రోజుల క్రితం తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ చెందాడు. మృతుడి భార్య గతంలో మృతి చెందగా ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడు వెంకటేశం సోదరుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మహాముత్తారం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని యామన్‌పల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యామన్‌పల్లికి చెందిన దేవ్‌సింగ్ పాడి గేదె గురువారం మేతకు వెళ్లింది. కాగా గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి పడడంతో గేదె తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తెలిపారు.

అమరుల ఆశయాలను కొనసాగించాలి

నర్సంపేట : ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైన కాచినపల్లి అమరుల ఆశయాలను కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆకాంక్షించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పట్టణంలో డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అమరుల సంస్మరణ సభలో శ్రీనివాస్ మాట్లాడారు. పీడిత ప్రజల సమస్యలు పరిష్కరించలేని బూర్జువా ప్రభుత్వాలు ప్రజల కోసం పోరాడుతున్న విప్లవకారులను చంపడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయప్రద

చిట్యాల: గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్రోసూరుపల్లి, చిట్యాల నాలుగవ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరి చేయించుకోవాలని కోరారు. అనంతరం తల్లి, పిల్లల బరువుల తీసి గ్రోత్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, భాగ్యలక్ష్మీ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు వాడాలి



లింగాకర్షక బుట్టలు పంపిణీ చేస్తున్న అధికారులు

రేగొండ: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నియంత్రణ కోసం లింగాకర్షక బుట్టలు వాడాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ప్రజ్వల్ సంస్థ పీయూ మేనేజర్ బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్గిల్ సంస్థ నుంచి అర్చన, సేఫర్డ్ సంస్థ నుంచి రామచంద్ర, ప్రజ్వల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తిని పండించే రైతులు వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. గులాబీ రంగు పురుగు నియంత్రణ కోసం లింగాకర్షక బుట్టలను పత్తి చేనులో పెట్టుకోవాలని తెలిపారు. బుట్టల వలన పురుగుల ఉధృతి తగ్గి, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం లింగాకర్షక బుట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ సిబ్బంది మౌనిక, మహేష్, తిరుపతి, చాణిక్య, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మల్హర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మల్క భాస్కర్‌రావు, కృష్ణమాచారి, గట్టు మధుకర్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది.

ఐక్య ఉద్యమాలతోనే పేదల రాజ్యస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

నర్సంపేట రూరల్ : ఐక్యఉద్యమాలతోనే పేదల రాజ్యస్థాపన జరుగుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేత రాయల చంద్రశేఖర్ తెలిపారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. గత 50 ఏళ్లుగా పేదల రాజ్యస్థాపన కోసం వివిధ రకాల పోరాటాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. రాజ్యాధికారం సాధించే స్థాయిలో పోరాటాలు ఉపయోగపడలేదని చెప్పారు. పంటలకు రైతులు ధర నిర్ణయించలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఢిల్లీ రైతుల పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశంలో నిరుదోగ్యం భారీగా పెరిగినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించని దుస్థితి నెలకొందని చెప్పారు. పేదల రాజ్యస్థాపన కోసం విప్లవ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో 50 ఏళ్లుగా పోరాడుతున్నట్టు వివరించారు. ఉపాధి హామీ పథకంతో పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న చంద్రన్న, గడ్డం సదానందం, అడ్డూరి రాజు, ఫణి, శ్రీనివాస్, దార లింగయ్య, అర్శం అశోక్, చొప్పరి పైడి, కొమురయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవం

కమలాపూర్: కమలాపూర్ మండలం ఉప్పల్‌లోని సాంబమూర్తి స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ద్వాదశ నదీజలాలతో సకల దేవతా ఆహ్వానాలు, స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉమమహేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవం బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ శర్మ ఆధ్వర్యంలో గోవర్ధనగిరి నర్సయ్య శర్మ, తుమ్మల మధుకర్ శర్మ, గోవర్ధనగిరి వినయవర్ధన శర్మ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నల్ల సుదర్శన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి, మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పొలాల సరోత్తంరెడ్డి, నందికొండ మహిపాల్‌రెడ్డి, కూర వెంకటరాజిరెడ్డి, బట్టల వెంకట్, సరికొమ్ముల రవీందర్, తదితరులు ఉన్నారు.

'ఇసుక తోడుకొని డబ్బులు ఇవ్వడం లేదు'

ఏటూరునాగారం: మండల కేంద్రానికి సమీపంలోని మానసపల్లి గోదావరిలో 114 సర్వేనంబర్‌తోపాటు మరికొన్ని నంబర్లకు చెందిన భూముల్లో ఇసుకను తోడుకుంటున్నారని డబ్బులు ఇవ్వలేదని బాధితుడు గారె మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 మంది పేరుతో ఇసుక క్వారీ మంజూరు అయ్యిందని క్వారీ కోసం అనుమతులు వచ్చాక రైతులకు చెందిన భూముల్లో ఇసుకను తోడుతున్నారనే తప్పా డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇసుక క్వారీని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తనతో కొంత మందికి రావాల్సిన డబ్బులు ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. నగదు చెల్లించకపోతే ఇసుక క్వారీని అడ్డుకుంటామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న ఎస్సై రవికుమార్

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి ఎస్సై రవికుమార్ గురువారం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పిడిశెట్టి రాజు నెల రోజుల క్రితం కొడవటంచలోని ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా .. పోలీసులు వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి బాధితుడికి అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, దీంతో ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్సై సూచించారు.

క్రీడాకారులకు టీషర్ట్‌ల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న మాజీ చైర్మన్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో క్రికెట్ క్రీడాకారులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా టీషర్టులను మాజీ సర్పంచ్, మాజీ కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ గంట రాంనారాయణగౌడ్ పంపిణీ చేశారు. గురువారం ఆయన కాళేశ్వరంలోని గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న ఉడాన్ టీం సభ్యులలకు టీషర్ట్‌లను అందజేశారు. ఆయన వెంట డీసీసీ ప్రధానకార్యర్శి శ్రీనివాస్ రెడ్డి, షకీల్, తాజ్ బాబా, కంకణాల బాపు, ఏ.సారయ్య ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



కాటారం: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాళేశ్వరం: పూజలు చేస్తున్న నాయకులు

కాటారం/మల్హర్/పలిమెల: పలు మండలాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాటారంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు తెప్పల దేవేందర్‌రెడ్డి, కొట్టె ప్రభాకర్, విక్రమ్, స్వప్న, అలాగే మల్హర్‌లో మండల అధ్యక్షుడు రాజయ్య, ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జెడ్పీటీసీ అయిత కొమల రాజిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల రాహుల్, తాడిచర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, జంపయ్య పలిమెలలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండేర రాజేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కాళేశ్వరాలయంలో పూజలు

కాళేశ్వరం: మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా నాయకులు కాళేశ్వరాలయంలో అభిషేకం, అర్చన పూజలు చేశారు. ఎంపీటీసీ మమతనాగరాజు, నాయకులు అశోక్, శ్రీనివాసరెడ్డి, జానీ, ఎం.సారయ్య, శకీల్, బాబా,లక్ష్మణ్, సీతయ్య, హైదర్, రాజశేఖర్, సంజీవరెడ్డి, ఏ.సారయ్య, మధుసూదన్, కాంత్, ఇమ్రాన్, సంతోష్, సత్తయ్య, అరుణ్, పోచం ఉన్నారు.

మానవత్వం చాటుకున్న కిరాణా వ్యాపారి



డబ్బులు అందజేస్తున్న శ్రీనివాస్

ములుగు: కిరాణా షాపు వద్దకు వచ్చి డబ్బులు మరిచి పోయి వెళ్లిన కొనుగోలు దారుడికి షాపు యజమాని తిరిగి డబ్బులు అందించి మానవత్వాన్ని చాటుకున్న సంఘటన ములుగులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండలం పందుకుంట (భూపాల్‌నగర్) కు చెందిన పత్తిపాక సాంబయ్య అనే సింగరేణి ఉద్యోగి ములుగు ఎస్‌బీఐలో మూడు లక్షల యాభైవేల రూపాయలు డ్రా చేసుకోని కిరాణా షాపు వద్దకు వచ్చి సరుకులు కొనుగోలు చేసి డబ్బులు షాపులో మర్చిపోయి వెళ్లాడు. కాగా కిరాణా షాపు యజమాని సాంబయ్య మరిచి పోయిన కవర్‌ను పరిశీలించగా అందులో డబ్బులు ఉన్నట్టు గుర్తించి పక్కకు పెట్టి ఉంచాడు. కొంత సమయం తర్వత తిరిగి తన డబ్బుల కవర్‌ను మర్చి పోయానని చెప్పటంతో కవర్‌లో ఎంత సోమ్ము ఉన్నది అనే వివరాలను అడిగి తెలుసుకోని డబ్బులను తిరిగి అందజేశారు.